క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డు కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్ బుధవారం తన వార్డులో పూజలు చేసి పలు రకాల పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డులో రూ.11లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు, రూ.పది లక్షలతో సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు చెప్పారు. కాగా పనులు సకాలంలో పూర్తి చేయాలని నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు ఉదయ్‌కుమార్, కృష్ణ, శివలతో పాటు పలువురు వార్డుకు చెందిన నాయకులు వెంకట్రావ్, భిక్షపతి, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణం తనిఖీ



నార్సింగిలోని ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ వసంతసుగుణ, ఎస్‌ఐ

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణంలో ఏడీఏ వసంత సుగుణ, ఎస్‌ఐ అహ్మద్ మోహినొద్దీన్ కలిసి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేసి విత్తనాలు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. నాణ్యతతో కూడిన విత్తనాలను విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా రశీదు అందించాలని సూచించారు. ఆమె వెంట ఏఈఓ విజృంభణ ఉన్నారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఎస్‌ఐ నారాయణగౌడ్‌తో కలిసి ఏఓ లక్ష్మీప్రవీణ్ తనిఖీ నిర్వహించారు. విత్తనాలు, ఎరువుల స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు.

దర్జాగా రేషన్ బియ్యం అమ్మకాలు

శివ్వంపేట(నర్సాపూర్): నిబంధనలకు విరుద్ధంగా దర్జాగా రేషన్ బియ్యం అమ్మకాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గోమారం గ్రామానికి చెందిన రామకృష్ణరెడ్డి, వీరారెడ్డి ఆరోపించారు. గోమారం గ్రామంలోని పలు రైస్‌మిల్స్‌కు నిత్యం వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన రేషన్ బియ్యం ఆటోల్లో తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు చెప్పారు. సంబంధిత అధికారులు నిఘా ఏర్పాటు చేసి, రేషన్ బియ్యం అమ్మకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

గడ్డి వాము దగ్ధం

నర్సాపూర్ రూరల్: ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గడ్డివాము దగ్ధమైన సంఘటన మండలంలోని పెద్ద చింతకుంటలో జరిగింది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగలి రుక్కులుకు చెందిన గడ్డివాముకు నిప్పంటుకుంది. పలుమార్లు ఫైర్ సిబ్బందికి ఫోన్ చేసినా స్పందించలేదని గ్రామస్తులు తెలిపారు.

ఘనంగా టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

గజ్వేల్: తెలంగాణ ప్రొగ్రెస్సివ్ టీచర్స్ యూనియన్ (టీపీటీఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం గజ్వేల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ కన్వీనర్ నరేందర్ సంఘం జెండాను ఆవిష్కరించారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో టీపీటీఎఫ్ ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ సీనియర్ నాయకులు రాంచంద్రం, రాజులు, ఎల్లయ్య, దూలం నర్సింలుగౌడ్, మల్లయ్య, నాగభూషణం, గెజిటెడ్ హెచ్‌ఎం కనకరాజు, జోన్ పరిధిలోని ఆయా మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తూప్రాన్: మగ సంతానం కలుగలేదని మనస్తాపంతో పురుగు మందు సేవించి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని వెంకటాయిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జాప సత్తి (26) ఆరేళ్ల క్రితం మల్కాపూర్‌కు చెందిన కవితను పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కూతుళ్లు జన్మించారు. కాగా మగ సంతానం కలుగ లేదని కొంతకాలంగా మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలోనే మంగళవారం పురుగు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి మేడ్చల్ జిల్లాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాణ్యత విత్తనాలే కొనాలి

జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్



పాపన్నపేట(మెదక్): యూసుఫ్‌పేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్



నర్సాపూర్ రూరల్: కాగజ్ మద్దూర్‌లో ..

పాపన్నపేట(మెదక్): రైతులు నాణ్యత గల విత్తనాలను కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ అన్నారు. బుధవారం ఏఓ నాగం కృష్ణ, ఏఓ జనార్దన్‌తో కలసి యూసుఫ్‌పేటలో రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లూజుగా ఉన్న ధాన్యం సంచులను కొనుగోలు చేయ్యొద్దని, రశీదులు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. పంటకాలం పూర్తయ్యే వరకు విత్తన పాకెట్‌లను, బిల్లులను భద్రంగా ఉంచాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన షాపులలోనే కొనుగోలు చేయాలన్నారు.

కాగజ్ మద్దూర్‌లో..

నర్సాపూర్ రూరల్: విత్తనాల కొనుగోలు, నాణ్యత ప్రమాణాలపై మండల వ్యవసాయ అధికారులు కాగజ్ మద్దూర్, లింగాపూర్, జక్కపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్, ఏఈఓ చంద్ర వేణి పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఫర్టిలైజర్ దుకాణాల్లో ప్రభుత్వ అనుమతులు ఉన్న ఎరువులు, విత్తనాలనే అమ్మాలని చిలప్‌చెడ్ మండలం వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి అన్నారు. ఆయన ఎస్‌ఐ షేక్ మహబూబ్‌తో కలసి మండలంలోని రైతు ఆగ్రో సేవా కేంద్రం, పీఏసీఎస్, రైతు ఉత్పత్తి కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రాల్లో విత్తనాలు, తదితర స్టాక్ పరిశీలించడంతో పాటు రికార్డులు తనిఖీ చేశామన్నారు. అదేవిధంగా విత్తనాల నమూనాలు సేకరించామన్నారు. ఎరువుల దుకాణ నిర్వాహకులు సబ్సిడీ జీలుగ, యూరియా బస్తాలు అమ్మే సమయంలో తప్పనిసరిగా కొనుగోలు చేస్తున్న రైతు ఆధార్ నంబర్ తీసుకోవాలన్నారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. నకిలీ ఎరువులు, విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం నిర్వాహకుడు శ్రీనివాస్ ఉన్నారు.

విత్తన కొనుగోలుపై జాగ్రత్తలు అవసరం

టేక్మాల్(మెదక్): విత్తన కొనుగోలులో పలు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాం ప్రసాద్ తెలిపారు. మండలంలోని కాద్లూర్ గ్రామంలో రైతులకు సాగు విధానంపై, విత్తనాల వాడకంపై అవగాహన కల్పించారు. ఇందులో ఎంఈఓ హరీశ్ తదితరులు ఉన్నారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట(మెదక్): నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ శంకర్, ఇన్‌చార్జి ఏఓ రాజేష్ కుమార్ అన్నారు. పేటలో ఈ సందర్భంగా విత్తనాలను, ఎరువుల స్టాకులను, రికార్డులను పరిశీలించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రసీదులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ లు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు సాగుకోసం నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని ఏఓ స్వప్న సూచించారు. మండలంలోని ముట్రాజ్‌పల్లి, జాజి తండా, వెల్మకన్న, దేవులపల్లి, కూకుట్లపల్లి, కొత్తచెరువు తండాల్లో రైతులకు విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో ఏఈఓలు రాజశేఖర్‌గౌడ్, దివ్యశ్రీ, బీటీఎం గౌతమి ఉన్నారు.

గౌతోజీగూడెంలో..

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాలలో వ్యవసాయ అధికారుల సమక్షంలో రైతులకు విత్తనాల కొనగోలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండలంలోని గౌతోజీగూడెంలో వానకాలం పంటలపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ విత్తనాలు కొనగోలు చేసే సమయంలో రశీదు తప్పకుండా తీసుకోవాలన్నారు. లైసెన్స్ ఉన్న డీలర్ వద్దనే కొనుగొలు చేయాలని, పంట దిగుబడి వచ్చే వరకు, పంటకాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా భద్రపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నరేందర్‌గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

రేగోడ్(మెదక్): నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఏఓ జావీద్, ఎస్‌ఐ రాజయ్య హెచ్చరించారు. మండల కేంద్రం రేగోడ్‌లోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీలర్లు తమ దుకాణాల్లో స్టాక్ బోర్డులు, లైసెన్సులు తప్పని సరిగ్గా ప్రదర్శించాలని, స్టాక్, బిల్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించాలన్నారు. విత్తన ప్యాకెట్లపై లేబుళ్లను పరిశీలించి గడువు దాటిన విత్తనాలను అమ్మకుండా చూడాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై సీడ్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో సమకూర్చాలని సూచించారు.

జీలుగ కోసం రైతుల తిప్పలు



చేగుంట వ్యవసాయ కార్యాలయం వద్ద బారులు తీరిన రైతులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట వ్యవసాయ కార్యాలయానికి జీలుగ విత్తనాల కోసం రైతులు బారులు తీరారు. బుధవారం జీలుగ విత్తనాలు వచ్చాయని తెలుసుకున్న గ్రామాల రైతులు పట్టా పాస్‌పుస్తకాలతో వ్యవసాయ కార్యాలయానికి తరలి రాగా కొద్దిసేపటికే మొత్తం స్టాకు అయిపోయింది. దీంతో రైతులు వ్యవసాయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో జీలుగ విత్తనాలు గురువారం వస్తున్నాయని అందరికీ అందిస్తామని వ్యవసాయ శాఖ అధికారులు వారిని సముదాయించారు. విత్తనాలు ఇవ్వకుంటే ధర్నా చేస్తామని హెచ్చరించి రైతులు వెళ్లిపోయారు.

బస్సులో ప్రయాణికుల గొడవ



బస్సులో గొడవ పడుతున్న ప్రయాణికులు

నర్సాపూర్: పట్టణం నుంచి బాలనగర్‌కు వెళ్లే బస్సులో బుధవారం పలువురు ప్రయాణికులు సీటు కోసం గొడవ పడ్డారు. బస్సు బస్టాండ్‌లో ఉండగానే మహిళల మధ్య సీటు కోసం గొడవ ప్రారంభమైంది. బస్సు కదిలినా గొడవ సద్దుమణగకపోగా మహిళల వెంట ఉన్న పురుషులు సైతం ఒకరినొకరు తిట్టుకునే వరకు వెళ్లింది. బస్సు కండక్టర్ ఇరు వర్గాలకు నచ్చ చెప్పినా.. వినకలేదు. దీంతో డ్రైవర్ బస్సును పట్టణంలోని ఆర్టీసీ పెట్రోల్ బంకు సమీపంలో నిలిపివేసి గొడవ ఆపితేనే బస్సు ముందుకు కదులుతుందని హెచ్చరించారు. బస్సులోని ఇతర ప్రయాణికులు జోక్యం చేసుకొని గొడవ మానుతారా కిందికి దిగి పోతారా అని గట్టిగా అనడంతో గొడవ పడటం ఆపారు. ఇందుకు సంబంధించిన వీడియో పలు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టింది.

పంచాయతీ ఆస్తులను పరిరక్షించాలి



శివ్వంపేటలో నర్సరీని పరిశీలిస్తున్న డీపీఓ జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఆస్తులను పరిరక్షించడంలో సిబ్బంది కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రం శివ్వంపేట, తిమ్మాపూర్ గ్రామాల్లోని పంచాయతీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో ఉన్న పంచాయతీ ఆస్తులు గ్రామ కంఠం భూములతో పాటు డంప్ యార్డులు, క్రిమిటోరియం, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, ప్రకృతివనాలు పరిరక్షించడంలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం అన్నారు. కార్యదర్శులు గ్రామాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి, కార్యదర్శి రమాదేవి ఉన్నారు.

నేడు కేవీకేలో స్వర్ణోత్సవాలు

కౌడిపల్లి(నర్సాపూర్): దేశంలో కేవీకే (కృషి విజ్ఞాన కేంద్రం) ప్రారంభమై 50 ఏళ్లు అవుతుంది. ఈ సందర్భంగా మండలంలోని తునికి వద్దగల డాక్టర్ డీ.రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ఈనెల 30న స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ డాక్టర్ శంబాజీ దత్తాత్రేయ నల్కర్, శాస్త్రవేత్త శ్రీనివాస్ తెలిపారు. రైతులకు కేవీకేలో సేంద్రియ వ్యవసాయం, పంటలు, కూరగాయలు, పండ్లతోటల సాగుపై అవగాహన కల్పించనున్నారు. దీంతోపాటు కేవీకే సూచనలతో సేంద్రియ సాగు చేస్తున్న రైతులకు సన్మానం చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి డీఏఓ గోవింద్, హార్టికల్చర్ అధికారి నర్సయ్య, నత్నయపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శోభారాణి ముఖ్యఅతిథులుగా హాజరు అవుతున్నట్లు తెలిపారు.

అందుబాటులో జీలుగు విత్తనాలు



నాగ్సాన్‌పల్లి ఎరువుల దుకాణంలో జీలుగు బస్తాలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని నాగ్సాన్‌పల్లిలోని డీసీఎంఎస్ ఎరువుల దుకాణంలో జీలుగు విత్తనాలు వచ్చాయని ఏఓ స్వప్న, డీలర్ భిక్షపతి బుధవారం తెలిపారు. ఈనెల 30న ఉదయం రైతులకు విక్రయించనున్నట్లు చెప్పారు. కావాల్సిన మండల రైతులు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో సంప్రదించాలని చెప్పారు. సబ్సిడీ పోను 30కిలోల బస్తా రూ.1116కు లభిస్తుందన్నారు. 150 బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పరిశ్రమ క్యాంటీన్‌లో ఫుడ్ పాయిజన్**

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని నవాబుపేటలోని ఫ్లెమింగ్ పరిశ్రమ క్యాంటీన్‌లో ఫుడ్ పాయిజన్‌తో పలువురు కార్మికులకు అస్వస్థకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం క్యాంటీన్‌లో భోజనం చేసిన పలువురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం వారిని చికిత్స నిమిత్తం షాపూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. స్వల్ప అస్వస్థకు గురైన పలువురు కార్మికులకు వైద్య పరీక్షలు చేయించామని, ఎలాంటి ఇబ్బంది లేదని పరిశ్రమ యాజమాన్యం తెలిపారు.

◆ **తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి**

కొల్చారం(నర్సాపూర్): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ కోసం ఉద్యమం చేసిన వారిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి, సముచిత స్థానం కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆవిర్భావ దినోత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కవి అందెశ్రీని ఆహ్వానించడం దళితులకు గర్వించదగ్గ విషయం అన్నారు. అమరులైన పోలీస్ కిష్టయ్య, శ్రీకాంత్ చారి, యాదగిరి లాంటి కుటుంబాలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా వారికి 5 ఎకరాల భూమి, రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

◆ **సీఈఐఆర్‌తో దొరికిన ఫోన్‌లు**

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంతో పాటు జప్తిశివనూర్ గ్రామాలకు చెందిన వారి ఫోన్‌లు పోగా సీఈఐఆర్ ద్వారా దరఖాస్తు అందించగా ఫోన్‌లను వెతికి వారికి అందించినట్లు ఎస్‌ఐ అహ్మద్ మోహినొద్దీన్ తెలిపారు. నార్సింగి మండల కేంద్రానికి చెందిన వట్టపు నర్సింలు, జప్తిశివనూర్ కాశ్యతండాకు చెందిన మహ్మద్ జజీర్ ఫోన్‌లు పోగొట్టుకున్నారు. ఇదే విషయంపై సీఈఐఆర్ ద్వారా దరఖాస్తు చేశారు. దీంతో పోలీస్‌లు సెల్‌ఫోన్లను నూతన టెక్నాలజీతో పట్టుకొని బాధితులకు అందించారు. ఎవరైన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నట్‌లైతే సీఈఐఆర్ ద్వారా తమ వివరాలు, ఫోన్ వివరాలతో దరఖాస్తు చేస్తే సెల్‌పోన్ వెతికి ఇవ్వనున్నట్లు తెలిపారు.

◆ **జొన్నల కొనుగోలుపై హర్షం**

టేక్మాల్(మెదక్): రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు రైతుల నుంచి ఎకరాకు 12 క్వింటాళ్ల జొన్నలను అధికారులు కొనుగోలు చేయనున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నిమ్మరమేశ్ బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ఇంతకు ముందు రైతుల నుంచి కొనుగోలు కేంద్రంలో ఎకరాకు 8 క్వింటాళ్లు మాత్రమే జొన్నలు కొనుగోలు చేసేవారన్నారు. రైతుల కోరిక మేరకు మంత్రి దామోదర్ ఆదేశాలతో ఎకరాకు 12 క్వింటాళ్లు కొనుగోలు చేస్తారని తెలిపారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

క్రీడలతో మానసికోల్లాసం

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌జోన్: ప్రతీ వ్యక్తి దైనందిక జీవితంలో వ్యాయామాన్ని దినచర్యగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం పట్టణంలో రాజీవ్ గాంధీ స్టేడియంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో మే 1న ప్రారంభమై, మే 31న ముగియనున్న సమ్మర్ ఫుట్‌బాల్ అండ్ అథ్లెటిక్స్ వేసవి క్రీడా శిబిరాన్ని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ క్రీడను ప్రారంభించి క్రీడాకారిణిలను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇష్టమైన క్రీడను ఎంచుకొని ముందుకెళ్లాలని అన్నారు. మెదక్ తహసీల్దార్ శ్రీనివాస్, యువజన క్రీడల నిర్వహణ అధికారి నాగరాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నర్సాపూర్ కాలేజీ కొనసాగిస్తాం

రీజినల్ కోఆర్డినేటర్ వెల్లడి

సాక్షి ఎఫెక్ట్

నర్సాపూర్: నర్సాపూర్‌లోని అప్‌గ్రేటెడ్ గిరిజన గురుకుల జూనియర్ కాలేజీని కొనసాగిస్తామని గిరిజన గురుకులం విద్యాలయాల సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ తెలిపారు. బుధవారం సాక్షిలో వచ్చిన 'గురుకుల కాలేజీకి మంగళం?' కథనానికి ఆయన స్పందించి పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ఆయా గిరిజన గురుకుల కాలేజీలతో పాటు నర్సాపూర్‌లోని అప్‌గ్రేటెడ్ గిరిజన గురుకుల బాలుర జూనియర్ కాలేజీలో సైతం సీట్ల భర్తీకి చర్యలు తీసుకున్నామన్నారు. అందులో భాగంగా ఈనెల 31న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించి మొదటి సంవత్సరం అడ్మిషన్లు పూర్తి చేయనున్నట్లు ప్రకటించారు. నర్సాపూర్ మండలం నారాయణపూర్‌లోని కాలేజీలో హెచ్‌ఈసీ గ్రూపులో, మెదక్ బాలికల కాలేజీలో ఎంపీసీ గ్రూపులో, నర్సాపూర్‌లోని బాలుర కాలేజీలో ఎంపీసీ, బీపీసీ, సీఈసీ గ్రూపులలో, కౌడిపల్లిలోని బాలుర కాలేజీలో ఎంపీసీ, బీపీసీ గ్రూపుల్లో సీట్ల భర్తీకి 31న కౌన్సిలింగ్ చేపట్టనున్నామని చెప్పారు. కాగా 2023 – 24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని, పరిమిత సంఖ్యలో ఇతర కులస్తులకు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. జిల్లాలోని గిరిజన విద్యార్థులు తమ ఒరిజినల్ టీసీ, బోనాఫైడ్, మెమో, కుల, ఆదాయ, ఫిజికల్ ఫిట్నెస్ ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకొని రావాలని సూచించారు. కౌన్సిలింగ్‌కు వచ్చే విద్యార్థులు ఈనెల 31న ఉదయం 11 గంటలలోపు ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలన్నారు. కాగా విద్యార్థుల సంఖ్య ఆధారంగానే జూనియర్ కాలేజీలలో తరగతులు నిర్వహిస్తామని వివరించారు.

పనులు సక్రమంగా నిర్వహించాలి

ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా



మాట్లాడుతున్న ఎంపీడీఓ

పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధి హామీ పనులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బందితో ఉపాధి హామీ పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాలల్లో కూలీలకు ఉపాధి హామీ పనులపై అవగాహన, తాగు నీరు, ఇతర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీఓ నవాజ్, టెక్నికల్ అసిస్టెంట్లు స్వాతి, స్వప్న, వినోద, మోహన్, సుబాష్, కంప్యూటర్ ఆపరేటర్లు రతన్, ఉపేందర్, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



కేంద్రంలోని గుడ్లను పరిశీలిస్తున్న సూపర్ వైజర్

సాక్షి ఎఫెక్ట్

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని శంకర్ తండాలోని మినీ అంగన్‌వాడీ సెంటర్‌లో కుళ్లినగుడ్లపై బుధవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసుమతి పరిశీలించారు. కేంద్రంలోని గుడ్లను పరిశీలించడంతో పాటు పిల్లల తల్లులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని గుడ్లను ఉడకబెడితే బాగానే ఉన్నాయని చెప్పారు. లబ్ధిదారుడికి ఇచ్చిన గుడ్లు ఆమ్లెట్ వేసుకునేందుకు పగలగొట్టగా.. వేసవికాలం కావడంతో పచ్చసీలం పలుచగా ఉందని గుడ్లు పాడైపోలేదన్నారు. మరికొన్ని కేంద్రాల్లోని గుడ్లను పరిశీలించనున్నట్లు తెలిపారు.

విరిగిన 300 విద్యుత్ స్తంభాలు

ఎస్‌ఈ జానకీరాం



విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్‌ఈ జానకీ రాం

పాపన్నపేట(మెదక్): గాలి దుమారంతో ఈనెల 23న మండలంలో 300 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయని విద్యుత్ శాఖ ఎస్‌ఈ జానకీరాం తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించి, విద్యుత్ నష్టంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 100 స్తంభాలకు మరమ్మతులు చేసి, విద్యుత్ పునరుద్ధరించామన్నారు. విద్యుత్ స్తంభాల క్రింద ఉన్న చెట్లను తొలగించామని చెప్పారు. దాదాపు అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని తెలిపారు. మిగతా మరమ్మతులు త్వరలో పూర్తి చేస్తామని అన్నారు. ఆయన వెంట డీఈ కృష్ణారావు, డీఈటీ రాంబాబు, ఏడీఈ మోహన్‌బాబు, ఆనంద్‌రావు, ఏఈ నర్సింలు ఉన్నారు.

పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయండి



దుబ్బాకలో టీపీటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

దుబ్బాకటౌన్: ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కౌన్సిలర్ రాజమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం పట్టణంలోని స్థానిక మండల వనరుల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల ఖాళీలను వెంటనే భర్తీ చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. కామన్ స్కూల్, శాస్త్రీయ విద్యావిధానం అమలయ్యేలా, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్య పరిష్కారానికి టీపీటీఎఫ్ పోరాటం చేస్తుందన్నారు. టీపీటీఎఫ్ నాయకులు నర్సింహారెడ్డి, సిద్ధిరాములు, నూర్ బాబా పాల్గొన్నారు.